సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 27, ఫిబ్రవరి, 2023



యాంత్రీకరణ వైపు..

రైతులు యాంత్రీకరణ వైపు చూడాలని అధికారులంటున్నారు. అద్దెకు యంత్రాలు కూడా ఇస్తున్నారు.

- 8లో



గుంటూరులో జిల్లా వాసి మృతి

మెళియాపుట్టి మండలానికి చెందిన ఓ మహిళ గుంటూరులో మృతి చెందారు. విద్యుత్ షాక్‌తో చనిపోయారు.

- 8లో

ముగిసిన శతచండీయాగం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో గత ఐదురోజులుగా జరుగుతున్న శతచండీ యాగం ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిసింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో పూర్ణాహుతిలో పట్టుచీర, సమిధ వేసి ముగించారు. ఈ సందర్భంగా శంకర విజయేంద్ర మహాస్వామికి తలపాగా కిరీటం పెట్టి ఊరేగించారు.

కొలను కంట నీరు



ఆక్రమణకు గురవ్వడంతో కుదించుకుపోయిన రామన్న చెరువు

- కనుమరుగైపోతున్న రామన్న చెరువు
- నిమ్మాడ పక్క ఊరిలో ఆక్రమణల దందా
- మూడింతల చెరువు కబ్జా
- అచ్చెన్న అనుచరులే ఆక్రమణదారులు





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఒకప్పుడు అది పదహారున్నర ఎకరాల చెరువు. నేడు కొలతలు తీస్తే నాలుగు ఎకరాలే కనిపిస్తోంది. చిట్టివలస రెవెన్యూ పరిధిలోని భూములన్నింటికీ ఆ కొలనే దాహం తీర్చేది. ఇప్పుడు అదే చెరువు పొలమై తిరిగి నీరడుగుతోంది. తులసిపేటలోని రామన్న చెరువు కాలంతో పాటు కరిగిపోతోంది. ఆక్రమణదారుల ఆకలికి ఆహారమవుతోంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సొంతూరు నిమ్మాడ పక్కనే ఉన్న తులసిపేటలో 'తమ్ముళ్లు' చెరువును మింగేసే పనిలో ఉన్నారు.

కోటబొమ్మాళి మండలం చిట్టివలస రెవెన్యూ పరిధిలోని తులసిపేట గ్రామంలో గల రామన్నచెరువు చుట్టు పక్కల పంట భూములకు సాగునీరిచ్చేది. సర్వే నంబర్ 226లో గల ఈ చెరువుపై ఆక్రమణదారుల కన్ను పడింది. అడిగే వారు లేకపోవడంతో ఒక్కో ముక్కా కబ్జా చేస్తూ మూడింతల చెరువును పొలంగా మార్చేశారు. టీడీపీ కీలక నేత అండదండలు చూసుకుని తెగ రెచ్చిపోయారు. రామప్పడు, సత్యం, చలమాజీ, పాపారావు, బాలరాజు, రమణ తదితర వ్యక్తుల చేతిలో చెరువు బందీ అయిపోయింది. వీరంతా తెలుగుదేశం పార్టీ నాయకులే. అందుకే కళ్ల ముందు చెరువు కనుమరుగైపోతున్నా రెవెన్యూ అధికారులు సైతం పట్టించుకోలేదు. నిమ్మాడ పెద్దల అరాచకానికి భయపడి ఈ ఆక్రమణల జోలికి పోవడం లేదు.

అక్రమాలెన్నో..

కోటబొమ్మాళి మండలం నిమ్మాడ చుట్టు పక్కల గ్రామాల్లో తమ్ముళ్ల దందా అంతా ఇంతా కాదు. ఎక్కడ చూసినా వారి బాగోతం కనిపిస్తూనే ఉంటుంది. పేదలు, దళితులకు ఇచ్చిన డీ పట్టా భూములను ఆక్రమించేసి, పట్టాదారులను రాకుండా అడ్డుకుంటున్నారు. వాటిలో ఒకటి ఇటీవల వెలుగు చూసింది. ఇదే తులసీపేటలో టీడీపీ పార్టీ ఆవిర్భావానికి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 52మంది నిరుపేద ఎస్సీ, బీసీలకు ఇచ్చిన 19.62ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూమి ఆక్రమణకు గురైన వ్యవహారం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మైనింగ్ దందా గురించైతే చెప్పనక్కర్లేదు. నిత్యం ఇక్కడ అక్రమ రవాణా జరుగుతూనే ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి అనుమతుల్లేకుండా విలువైన గ్రానైట్‌ను ఇక్కడున్న పాలిషింట్ యూనిట్లకు తరలించి అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో గ్రానైట్ అక్రమంగా తరలిస్తూ అనేక ట్రాలీలు పట్టుబడ్డాయి. అందులో కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ బాగోతం కూడా బయటపడింది. దీనిపై కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో మైనింగ్ అధికారులు ఫిర్యాదు కూడా చేశారు. ధాన్యం, బియ్యం మాఫియా కూడా అదనం. అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాద్‌కు చెందిన మిల్లు పైన, గోడౌన్‌పైన అనేక ఆరోపణలు ఉన్నాయి.



రికార్డుల్లో చెరువుగా నమోదై ఉన్న దృశ్యం

దేశ సేవలో తండ్రీ కుమారుడు

మందస: మూడు దశాబ్దాలుగా దేశ సేవ చేస్తున్న తండ్రి తన వారసుడిని కూడా తన బాటలోనికే తీసుకువచ్చారు. ఆయన చేతులమీదుగానే కుమారుడు ఆర్మీలో బాధ్యతలు అందుకోవడం మరీ విశేషం. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్డూరు గ్రామానికి చెందిన పందిరి వాసుదేవరావు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 1993లో చేరి పనిచేస్తున్నారు. ఇన్నేళ్లుగా దేశసేవలో తరిస్తున్న ఆయన ఇప్పుడు తన కుమారుడిని కూడా ఆర్మీలోనే చేర్చారు. వాసుదేవరావు, ఈశ్వరి దంపతులు తమ కుమారుడు తేజేశ్వరరావును ఎంబీబీఎస్ చదివించారు. ఇతను మార్చిలో పీజీ పరీక్ష రాయాల్సి ఉంది. కానీ ఆర్మీలో వైద్యునిగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో అటు వైపే వెళ్లారు. ఇటీవలే ఉత్తర్వులు అందడంతో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో గల ఆర్మీ బేస్ ఆస్పత్రిలో డాక్టర్‌గా నియమితులయ్యారు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బీఎస్ఎఫ్‌లో హెచ్‌సీగా పని చేస్తున్న వాసుదేవరావు చేతుల మీదుగానే తేజేశ్వరరావు కెప్టెన్ ర్యాంక్ త్రీస్టార్స్ బ్యాడ్జి అందుకున్నారు. తండ్రి చేతులమీదుగా ఆర్మీలో బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని తేజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా తేజను మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ బొడ్డు శాంతిప్రియ, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉదయ్(ఉమాపతి) తదితరుల ఆధ్వర్యంలో సన్మానించారు.



తండ్రి వాసుదేవరావు చేతుల మీదుగా కెప్టెన్ బ్యాడ్జి పొందుతున్న కుమారుడు ఆర్మీ డాక్టర్ తేజేశ్వరరావు

చెత్తపై సమరం



శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలో చెత్తపై అధికార యంత్రాంగం సమరం ప్రకటించింది. అందులో భాగంగా గడిచిన 20 ఏళ్లుగా నగరంలో సేకరించిన 2.50 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తండేవలసలో ఏర్పాటు చేసిన బయోరెమిడేషన్, బయో మైనింగ్ ద్వారా చెత్తను విచ్ఛిన్నం చేస్తున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఒక్కో శాఖ ద్వారా వన్ థర్డ్ నిధులతో కలిపి రూ.18కోట్లు మంజూరు చేశారు. చెత్తను వారియర్ మిషన్ల ద్వారా ప్రతి రోజు తండేవలస కేంద్రంలోనే వేర్వేరు పద్ధతుల్లో విచ్ఛిన్నం చేస్తున్నారు.

ఎలా చేస్తారంటే..?

వారియర్ మిషన్ ద్వారా చెత్తను నాలుగు విభాగాలుగా వేరు చేస్తారు. పొడి ఎరువు, ప్లాస్టిక్ వ్యర్థాలు, రాళ్లు రప్పలు, ఐరన్ వస్తువులను విడదీస్తారు. ఆయా మిషన్ల ద్వారా వేర్వేరుగా సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి, మండే స్వభావం గల వాటిని సిమెంట్ ఫ్యాక్టరీలకు, విద్యుత్ తయారీకు ఉపయోగించనున్నారు. మిగిలిన మెటల్స్ పదార్థాలను ఇతరత్రా వస్తువులను సైంటిఫిక్‌గా రీసైకిల్ చేస్తారు.



వారియర్ మిషన్ల ద్వారా చెత్తను వేర్వేరు పద్ధతుల్లో విచ్ఛిన్నం చేస్తున్న దృశ్యం

జూలై నాటికి క్లీన్ అండ్ గ్రీన్ చేస్తాం



తండేవలసలో 20 ఎకరాల్లో నిండుకున్న చెత్తను జూలై నాటికి క్లీన్ చేసి స్థలాన్ని జిల్లా యంత్రాంగానికి అప్పగిస్తాం. ఇప్పటికే ప్రతి రోజు 30 టన్నుల చెత్తను విశాఖపట్నంలోని కాపులుప్పాడకు విద్యుత్ అవసరాలకు పంపిస్తున్నాం. సేకరించిన చెత్తను వారియర్ మిషన్ల ద్వారా రీసైక్లింగ్ చేసే ప్రాజెక్టును గుంటూరుకు చెందిన జ్ఞానేశ్వర్ ఇంజినీరింగ్ వర్క్ ద్వారా చేపడుతున్నాం.

– చల్లా ఓబులేసు, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అత్యవసర సమావేశం రేపు



నరసన్నపేట: జిల్లా కేంద్రంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నేతల అత్యవసర సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రాంతీయ సమన్వయకర్త, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యే లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో ఆటో దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్నకోరాడ గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తోనంగి తవుడుకు చెందిన గడ్డి కుప్ప, తోనంగి రమేష్‌కు చెందిన ఆటో అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అరసవల్లిలో సప్తమి సందడి



క్యూలైన్లలో భక్తుల రద్దీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం విశేష భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. సప్తమి పర్వదినం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆరోగ్యం కోసం మరికొందరు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో భక్తుల కోసం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనానికి అనుమతిచ్చారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాలతో రూ.4,07,600, పూజలు, విరాళాల రూపంలో రూ.73,566, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని నాగావళి నదీ తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. హయాతి నగరం సందులోంచి నాగావళి ఏరుకు వెళ్లే దారిలో బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఎండిపోయిన కొబ్బరి డొక్కలపై ఉన్నట్లు ఆదివారం ఉదయం 6 గంటలకు సమాచారం రావడంతో పోలీసులు సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. హయాతినగరం వార్డు రెవెన్యూ కార్యదర్శి కె.చంద్రకిరణ్‌సింగ్ అక్కడకు వెళ్లి ఎడమ వైపు నోటి నుంచి నురగ ఉండటం, కుడి ఛాతీ పైభాగాన కె.కావేరి పేరుతో పచ్చబొట్టు ఉండటం చూశారు. మృతుడు నీలంరంగు చెక్ షర్టు ధరించి ఉన్నాడని, దూరంగా ప్యాంటు విడిచి ఉన్నాడని, 5.8 అడుగుల ఎత్తుండి, 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని రూఢీ చేసుకున్నారు. రెవెన్యూ కార్యదర్శి ఇచ్చిన స్టేట్‌మెంటు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు.

ఎస్పీ చొరవతో..

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జీఆర్ రాధిక మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె చొరవతో ఓ క్షతగాత్రుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం పడిమి సూర్య అనే యువకుడు పని కోసం తణుకు వెళ్లడానికి ఆమదాలవలసలో విశాఖ ఎక్స్‌ప్రెస్ అనుకుని కదులుతున్న సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కి దిగే క్రమంలో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు ప్రథమ చికిత్స కోసం తరలించారు. అప్పటికే యువకుడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ రాధిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేష్‌ను ఆస్పత్రికి పంపించి యువకుడికి సరైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఐ రిమ్స్‌కు వెళ్లి అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఎస్పీ ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి సరైన వైద్యం అందించాలని సూచించారు. ఎస్పీ చొరవతో తమ కుమారుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడని ఆమెకు రుణపడి ఉంటామని యువకుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఎస్పీ ఆదేశాలతో మెడికవర్ ఆస్పత్రిలో దగ్గరుండి వైద్య చికిత్స చేయిస్తున్న టూటౌన్ ఎస్ఐ వెంకటేష్

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలం ఈదుపురం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన చొబ్బి బెహరా కుమారుడు రవీంద్ర బెహరా(16), అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ బెహరా కుమారుడు దిలీప్ బెహరా(14)లు స్థానిక కంచ్ర వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10, 9 తరగతులు చదువుతున్నారు. ఈ నెల 24న శుక్రవారం ఉదయం వీరు బడికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి, శనివారం సాయంత్రం వరకు చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు చెబుతుండగా, తమ పిల్లలు పాఠశాలకు వెళ్లి అక్కడి నుంచే అదృశ్యమయ్యారని తల్లిదండ్రులు చెబుతున్నారు.



రవీంద్ర బెహరా



దిలీప్ బెహరా

● రాజమ్మ తల్లి జాతరకు పోటెత్తిన భక్తులు



రాజమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గార: వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు నాల్గో ఆదివారం పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా జనం తరలి రావడంతో రోడ్లు, వీధులన్నీ కిక్కిరిశాయి. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు బసచేసి ఆదివారం వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఎస్ఐ ఎం. మధుసూదనరావు పర్యవేక్షించారు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్స్

- మొదటి విడతలో 78 కేంద్రాల్లో మొదలైన ప్రాక్టికల్స్
- తొలిరోజు 6088 మందికిగాను 161 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం మొదలయ్యాయి. మొత్తం 134 కేంద్రాలకుగాను మొదటి విడతగా 78 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు 6,088 మంది హాజరుకావాల్సి ఉండగా 5,927 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 161 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పూట 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 3,486 మంది హాజరుకావాల్సి ఉండగా 3,379 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షలకు 2,602 మంది హాజరుకావాల్సి ఉండగా 2,548 మందిహాజరయ్యారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు ధ్రువీకరించారు.

రాష్ట్ర పరిశీలకులు హాజరు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాక్టికల్స్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రాలపై పూర్తిస్థాయిలో నిఘాపెట్టేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇంటర్ బోర్డు నుంచి రాష్ట్ర పరిశీలకుడిగా హాజరైన డి.గోపాల్‌రెడ్డి పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, రణస్థలంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్న తీరు, ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతోను, అక్కడి సీఎస్‌లు, డీఓలతో మాట్లాడారు. అలాగే జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు చేసిన ఏర్పాట్లను పరిశీలకులు గోపాల్‌రెడ్డికి వివరించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో ఏర్పాటుచేసిన స్ట్రీమింగ్ ద్వారా ఏర్పాట్లను, పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



శ్రీకాకుళంలోని శ్రీచైతన్య కళాశాలలో సీఎస్‌లు, డీఓలతో ఏర్పాట్ల గురించి మాట్లాడుతున్న డి.గోపాల్‌రెడ్డి, తవిటినాయుడు



శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళాశాల కేంద్రంలో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

తనిఖీల హోరు..

జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో తొలిరోజు అధికారులు తనిఖీలతో హోరెత్తించారు. ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు శ్రీకాకుళంలోని శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల తదితర కేంద్రాలను పరిశీలించారు. శ్రీకాకుళంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ బాలురు ఏ, బీ కేంద్రాలు, శ్రీకాకుళం ప్రభుత్వ బాలురు, ఎస్ఆర్ జూనియర్ కళాశాల సింగుపురం, పద్మావతి జూనియర్ కళాశాల నరసన్నపేట తదితర కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. హైపవర్ కమిటీ, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వేరువేరుగా విడిపోయి 60 కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ఖాతా నుంచి రూ.41వేలు మాయం

సారవకోట: మండలంలోని అన్నుపురం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తన ఖాతా నుంచి రూ.41 వేలు పోగొట్టుకున్నారు. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. హిర మండలం మండలం తంప గ్రామానికి చెందిన బలగ రేణుకకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము వైద్య శాఖ నుంచి మాట్లాడుతున్నామని, మీ నాన్న గతంలో గుండె ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా చేసుకున్నారని, దానికి సంబంధించి బీమా సొమ్ము అందిస్తామని చెప్పారు. అయితే ఆ డబ్బులు ఖాతాలో పడాలంటే కనీసం అకౌంట్‌లో రూ.2వేలు ఉండాలని సూచించారు. అయితే తన వద్ద అంత సొమ్ము లేదని చెప్పి తన సోదరి అన్నుపురం గ్రామానికి చెందిన గొర్లె నాగమ్మకు ఫోన్‌లో విషయం చెప్పింది. ఆమె కూడా తన ఖాతాలో డబ్బులు లేవని, ఆ గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త ఎడ్ల లక్ష్మీకాంతమ్మకు చెప్పింది. ఆమె అకౌంట్లో డబ్బులు ఉండడంతో బీమా సొమ్మును తన ఖాతాకు జమచేయాలని లక్ష్మీకాంతమ్మ కాల్ కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ నేరగాళ్లకు వివరాలు చెప్పేసింది. దీంతో వారు ఓ లింక్‌ను పంపించారు. దానిపై టచ్ చేయగానే ఆశ కార్యకర్త ఖాతా నుంచి రూ.41వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఆమె నిర్ఘాంతపోయింది. వెంటనే స్థానిక మహిళా పోలీసులకు సమాచారం ఇచ్చి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దళితుల ఇంటికి దారేది..?



దళితులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో మట్టి వేసిన టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఏళ్ల తరబడి దళితులు ఉపయోగిస్తున్న దారిపై మట్టి వేసి టీడీపీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారు. మండలంలోని మశాఖపురం గ్రామం దళితవాడకు ఆనుకుని శివాలయం ఉంది. ఆలయం ప్రహరీ నిర్మాణం, నవ గ్రహాల ఆలయ నిర్మాణం పేరుతో స్థానిక సర్పంచ్ కుమారుడు, టీడీపీ నాయకుడు ఆశి మాధవరావురెడ్డి ఆధ్వర్యంలో కొంత మంది టీడీపీ నేతలు దళితుల ఇళ్ల ముందు దారిని మూసివేసేందుకు సిద్ధమయ్యారు. దళితులు ప్రతిఘటించడంతో వారిపై జులుం ప్రదర్శించేందుకు కూడా వెనుకాడలేదు. నవగ్రహాల ఆలయం నిర్మిస్తుండటంతో వాస్తు దోషం వల్ల దళితుల దారిని పూర్తిగా మూసివేస్తున్నామని, పెరటి నుంచి రహదారి చేసుకోవాలని, లేకుంటే తమ ఆగ్రహానికి గురవ్వక తప్పదంటూ హెచ్చరించారు. దీంతో దళితులు పటాన గంగమ్మ, రఘునాథ్ పటాన, హేమావతి పటాన, పార్వతి పటాన, ధనలక్ష్మీ పటాన, సరస్వతి పటాన, పురుషోత్తం పటాన, పటాన భగవాన్‌లు ఇటీవల స్థానిక రూరల్ పోలీసులను ఆశ్రయించారు. మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ టీడీపీ నాయకులు ఆగ్రహించి ఏకంగా వారు రాకపోకలు సాగించే రహదారిని మట్టితో కుప్పలుగా నింపేశారు. దీంతో కనీసం మంచినీటి బోరు దగ్గరకు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో శనివారం రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ దళితవాడను సందర్శించి నిర్మాణాలు నిలిపివేయాలని, దళితులు రాకపోకలు సాగించేందుకు రహదారి ఇవ్వాలంటూ టీడీపీ నాయకులకు సూచించారు. ఎస్ఐ వద్ద ఒప్పుకున్న ఆ నాయకులు ఆదివారం మళ్లీ పనులు ప్రారంభించడం విశేషం. అదే గ్రామం చివర్లో జగనన్న కాలనీలో నిరుపేదల ఇళ్లు నిర్మిస్తుంటే ఇదే టీడీపీ నాయకులు పచ్చని చెట్లు ఉన్నాయంటూ నిర్మాణాలను గతంలో అడ్డుకున్నారు. అప్పటి టెక్కలి సబ్ కలెక్టర్ హెచ్చరించడంతో తోక ముడిచారు.

క్లుప్తంగా

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరావు కోరారు. టెక్కలిలో ఆదివారం నిర్వహించిన విద్యా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, పెండింగ్ డీఏలు అందజేయాలని, పీఆర్‌సీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, కె.దాలయ్య, పి.ధర్మారావు, జగదీష్, లక్ష్మీనారాయణ, బి.చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్ నిజాయితీ



చంద్రశేఖర్‌కు పర్సును అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: వెలగాడ సచివాలయం పరిధిలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఇమందు ఎర్రయ్య నిజాయితీని చాటుకున్నారు. అదివారం ఈయన వెళ్తుండగా రోడ్డుపై పర్సు దొరికింది. దీన్ని పరిశీలించగా అందులో 30 వేల రూపాయల నగదు, విలువైన కార్డులు, పత్రాలు ఉన్నాయి. అందులో ఉన్న అధార్ కార్డు అధారంగా వెలగాడ గ్రామానికి చెందిన పిడుగు చంద్రశేఖర్‌గా ఉంది. వీటిని ఎర్రయ్య తన సొంత ఊరు మధుపాం గ్రామానికి తీసుకువచ్చి సర్పంచ్ బగాది అప్పలనాయుడుకు విషయాన్ని తెలియజేశారు. ఆయన చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి పర్సు దొరికిన విషయాన్ని తెలియజేశారు. దీంతో చంద్రశేఖర్ గ్రామానికి రాగా పర్సును భద్రంగా అతనికి అందజేశారు. లైన్‌మెన్ ఎర్రయ్యను వెలగాడ పంచాయతీ సర్పంచ్ బొల్లా జనార్దనరావు, సచివాలయం కార్యదర్శి సురేష్‌కుమార్ అభినందించారు.

భర్తపై భార్య ఫిర్యాదు

కొత్తూరు: తన భర్త నిత్యం వేధిస్తున్నాడని మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ (ఇరపాడు)కి చెందిన మడపాన మహాలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. టెక్కలికి చెందిన తన భర్త సుదర్శన అదనంగా కట్నం తీసుకురావాలంటూ నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవిందరావు చెప్పారు.

గుంటూరులో మెళియాపుట్టి మండల వాసి మృతి



లండ విజయలక్ష్మి (ఫైల్)

మెళియాపుట్టి: గుంటూరులో మర్రిపాడుకే గ్రామ పంచాయతీ మురికింటి భద్ర గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లండ విజయలక్ష్మి (41) వలస కూలీగా గుంటూరులో భవన నిర్మాణ పనులు చేసుకుంటుంది. శనివారం సాయంత్రం పనిచేస్తున్న సమయంలో సమీపంలోని విద్యుత్‌తీగలు తాకడంతో షాక్‌కు గురైంది. తీవ్రగాయాలు కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని.. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతురాలి భర్త వెంకటరావు తెలిపారు. మృతురాలికి కుమార్తెలు మోహిని, సుహాసిని, కుమారుడు గణేష్ ఉన్నారు. ఇటీవలే పెద్దకుమార్తె మోహినికి వివాహం చేయాలని నిశ్చయించారు. అంతలోనే ఈ ప్రమాదం జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

యాంత్రీకరణ వైపు సాగుతూ..

- వ్యవసాయ పనుల్లో యంత్రాలను వినియోగించేలా రైతుల్లో అవగాహన
- అద్దెకు యంత్రాలు

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త: కె.భాగ్యలక్ష్మి



ఆమదాలవలస: రైతులు ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే పంటల సాగు, వ్యవసాయ పనులు చేస్తున్నారు. దీంతో వారికి ఖర్చుతోపాటు సమయం కూడా వృథా అవుతోంది. సకాలంలో పనులు పూర్తి చేసుకోలేక పంటలను కూడా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి అన్నదాతను ఆదుకునేలా కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు కృషి చేస్తున్నారు. యాంత్రీకరణ వినియోగం వైపు దృష్టిసారించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం అద్దె ప్రాతిపదికన యంత్రాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న, వేరుశెనగ, చెరుకును అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తగినంతమంది కూలీలు లభ్యత కావడం లేదు. దీనికితోడు కూలీలపై పెట్టే ఖర్చు రైతుకు భారంగా మారుతోంది. ఇలాంటి తరుణంలో వ్యవసాయ యాంత్రీకరణ విధానం అవసరమని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు యంత్ర పరికరాలు అందించేందుకు చర్యలు చేపడుతోంది. యంత్ర పరికరాల వినియోగంపై కేవీకే ప్రతినిధులు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అద్దె ప్రాతిపదికన యంత్ర పరికరాలను అందిస్తున్నారు.

అంతరకృషి పరికరం



ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఆ పరికరం కూరగాయలు, వరుసల్లో వేసిన మొక్కజొన్న, చెరుకు, పత్తి వంటి పంటల్లో అంతరకృషి చేసుకోటానికి అనువుగా ఉంటుంది. కూలీలపై పెట్టే ఖర్చు 50 శాతం వరకు తగ్గుతుంది. కలుపు సమర్థవంతంగా నివారించబడటమేకాకుండా భూమి గుల్ల బారుతుంది.

చాప్‌కట్టర్ (స్ప్రెడ్డర్)



మొక్కజొన్న, చెరుకు తదితర పంటలు కోత అనంతరం మిగిలిన గడ్డిని రెండించీలు వరకు ముక్కలు చేస్తుంది. దీనిని కంపోస్టుగా వాడుకోవచ్చు. ఎండిన కొబ్బరి ఆకులు, ఆయిల్ ఫామ్‌ను కూడా ముక్కలుగా కట్ చేసుకోవచ్చు. దీనిని రోజుకు రూ. 500 లేదా గంటకు రూ. 100 అద్దెకు అందుబాటులో ఉంటుంది.



నాట్లు వేసే యంత్రం

ఈ యంత్రంతో వరినాట్లు వరసల్లో వేసుకోవచ్చు. రోజుకు 5 నుంచి ఆరు ఎకరాల్లో నాట్లు సునాయాసంగా వేయవచ్చు. పంట దిగుబడి 20 నుంచి 25 శాతం వరకు పెరుగుతుంది. ఈ పద్ధతిలో నాట్లు వేస్తే ఎకరానికి 15 కిలోలు విత్తనాలు మాత్రమే సరిపోతాయి. ఈ యంత్ర పరికరాన్ని రూ. 600 అద్దెకు ఇస్తారు. ట్రాక్టర్‌తో పాటు తీసుకొని వెళ్తే ఎకరాకు రూ. 3,600 చెల్లించాలి.

విత్తనాలు విత్తే యంత్ర పరికం



ఈ యంత్రంతో ఎరువు, విత్తనం ఒకేసారి వేసుకోవచ్చు. దీనిద్వారా విత్తనాలను పంటను బట్టీ నిర్ణీత దూరంలో వేయడం వలన గాలి, వెలుతురు సక్రమంగా తగిలి పంట ఆరోగ్యంగా పెరుగుతుంది. విత్తనంతోపాటుగా భాస్వరం ఎరువులు వేయడం వల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి జరిగి దిగుబడి పెరుగుతుంది. వరిలాంటి పంటలు నేలకొరగకుండా దిట్టంగా ఉంటాయి. రోజుకు ఆరు నుంచి ఎనిమిది ఎకరాల వరకు ఈ యంత్రంతో విత్తుకోవచ్చు. ఈ పరికరాన్ని ఎకరాకి వంద రూపాయలు లేదా రోజుకు రూ. ఐదు వందల ప్రాతిపదికన అద్దెకు కేవీకే సిబ్బంది ఇస్తున్నారు.

పొలం తయారీ పరికరం (రోటావేటర్)



పొలం దున్నడానికి, దమ్ము చేయడానికి వినియోగించవచ్చు. దీంతో పొలం మెత్తగా దున్నడం.. చదును చేసుకోవచ్చు. ఎకరా దుక్కి చేయడానికి రూ. 100, ట్రాక్టర్‌తో కలిపి ఎకరానికి రూ. 1000 అద్దెకు ఇస్తారు. చివరు దుక్కి, దమ్ము రోటావేటర్‌తో చేయడం వలన పొలం చదునుగా ఉండి నీటి యాజమాన్యం సులువు అవుతుంది.

వరికోత యంత్రం (ప్యాడీ రీపర్)



దీంతో రోజుకు మూడు ఎకరాలను కోత కోసుకోవచ్చు. ఎకరానికి రూ. 1800 నుంచి రు.2000 వరకు అవుతుంది. కోత కోసిన చేను త్వరగా ఆరుతుంది. వరి మాగానుల్లో పెసర మినుము వేసే ప్రాంతాలకు అనువుగా ఉంటుంది.

వరి నూర్పిడి యంత్రం

గంటకు ఎకరా చేను వరకు నూర్పిడి చేసుకోవచ్చు. గంటకు రూ. 750 ఖర్చు అవుతుంది. రోజుకు సుమారు 8 ఎకరాల వరకు చేను నూర్పిడి చేయవచ్చు. ఇది అద్దెకు రోజుకు రూ. 500 లేదా ఎకరానికి రూ. 100 చెల్లించి అద్దెకు తీసుకోవచ్చు



ఐదు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు


కొత్తూరు: వారంతా ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఐదు దశాబ్దాల తరువాత వారంతా ఆదివారం కలుసుకొని సంతోషంలో తేలిపోయారు. దీనికి నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికై ంది. ఈ పాఠశాలలో 1972-73 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలతో పాటు పలు దేశాల్లో స్థిరపడిన వారంత నివగాం చేరుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. 50 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు నెమరివేసుకున్నారు. అప్పట్లో పాఠశాలకు వచ్చేందుకు వంశధార నదిలో చేసిన పడవ ప్రయాణం, సైకిల్‌తో రావడం, పూరిపాకల్లో చదవడం, గోనె సంచిలో పుస్తకాలు పెట్టుకొని తెచ్చుకోవడం గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఆత్మీయ కలయికకు కృషి చేసిన పూర్వ విద్యార్థి సింహాద్రి ప్రసాదరావును పూర్వ విద్యార్థులు దుశ్శాలువతో సత్కరించారు. పాడైన పాఠశాల ముఖద్వారం స్థానంలో కొత్తది నిర్మించేందుకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధి కోసం కలమట సుబ్బమ్మ పేరిట ఆమె కుమారులు రూ. పది వేలు విరాళంగా అందజేశారు. ఎంఈవో బి. శ్రీధర్, పాఠశాల హెచ్‌ఎం ఎస్.నిర్మల, శాస్త్రవేత్త బూరాడ వెంకటరమణలతో పాటు పలువురు ఉపాధ్యాయులను కూడా సత్కరించారు.

ఎల్లమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు



ఎల్లమ్మతల్లి గుడి



భక్తులు పూజించే పుట్ట

మందస: మూలిపాడు పంచాయతీ పరిధి గోపాలపురం-శ్రీనివాసపురం గ్రామాల్లో జామి ఎల్లమ్మతల్లి 131వ జాతర వచ్చే నెల ఒకటో తేదీన జరగనుంది. మహాశివరాత్రి అనంతరం ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు సంబంధించి మంజూష (మందస) కేంద్రంగా రాజులు పరిపాలించేవారు. అప్పట్లో ఈ ప్రాంతంలో తెల్లని నాగుపాము సంచరించేదని.. ఇది ఎవరికీ హానీ తలపెట్టకుండా ప్రస్తుతం ఉన్న పుట్టలోకి వెళ్లి, వస్తుండేదని పూర్వీకులు చెబుతుంటారు. కొంతకాలం తరువాత నాగుపాము క్రమేపి అంతర్ధానమైందని దీంతో ఈ పుట్టవద్ద మందస రాజులు 1890వ సంవత్సరంలో ఆలయం నిర్మించారని చెబుతున్నారు. రాజా శ్రీనివాసరాజమణిదేవ్ హయాంలో జామి యాత్ర వైభవంగా జరిగేది. అప్పటి నుంచి గుడి వద్ద యాత్ర జరుగుతోంది. ముడుపులు ఆలయంపైకి విసిరితే భక్తులు కోరిన కోర్కెలను ఎల్లమ్మతల్లి తీర్చుతుందని భక్తుల నమ్మకం. మందస, సోంపేట, కంచిలి, పలాస మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎల్లమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విశేషపూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గుసిరి వెంకటరావు, రామచంద్రమహంతి తెలిపారు.


పోలియో నిర్మూలనే రోటరీ లక్ష్యం



మాట్లాడుతున్న కల్యాణ్ చక్రవర్తి

శ్రీకాకుళం అర్బన్: పోలియో నిర్మూలనే రోటరీ అంతర్జాతీయసంస్థ లక్ష్యమని రోటరీ జిల్లా 3020 పోలియో నిధుల సేకరణ చైర్మన్ డాక్టర్ వై.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌బీ కాలనీలోని రోటరీ వనంలో పోలియో నిధుల సేకరణపై రోటరీ క్లబ్ ఆమదాలవలస వారితో కలిసి ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, బిల్ గేట్స్ ఫౌండేషన్, ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తూ ఇప్పటివరకు పోలియో నిర్మూలనకు రూ.30 వేల కోట్ల పైచిలుకు ఖర్చు చేసిందన్నారు. ఈ ఏడాది రోటరీ జిల్లా 3020 పోలియో నిర్మూలనకు రూ.2 కోట్లు నిధుల సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రూ.50 లక్షలు సేకరించిందన్నారు. కార్యక్రమంలో సహాయ గవర్నర్లు ఎంఆర్‌కే దాస్, జలుమూరు వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపు సత్యనారాయణ, బరాటం శ్రీనివాస, శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు కింతలి నాగేశ్వరరావు, కెప్టెన్ జగదీష్, ఆమదాలవలస అధ్యక్ష, కార్యదర్శులు పి.పాపారావు, తేజ లక్ష్మి, రోటరీ సరీ్వసెస్ అసోసియేషన్ అధ్యక్షులు వరదా కొండబాబు, క్లబ్ పోలియో చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, దేవరశెట్టి శివశంకర్, డాక్టర్ మంత్రి వెంకట్ స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు



మాట్లాడుతున్న హరినారాయణ

- ఏపీ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ రాంజీ

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అండతో వైష్ణవుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఏపీ రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కె.హరినారాయణ (రాంజీ) అన్నారు. సన్యాసిపుట్టుగలోని అగ్నికుల క్షత్రియ భవనంలో ఆదివారం నిర్వహించిన 14వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాత్తాద శ్రీవైష్ణవులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తన పదవీ కాలన్ని పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉన్నానన్నారు. అనకాపల్లి చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు తొండ నారాయణమూర్తి మాట్లాడుతూ.. తమ జీవన పరిస్థితులు, సామాజిక స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అన్ని విధాలుగా సహాయ సహకారాలు పొందేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల విశాఖపట్నం శారదా పీఠం వారి ఆధ్వర్యంలో అర్చక శిక్షణ పొందిన అయ్యవార్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు యతిరాజ్యం బాలగోపాలరావు, ఉపాధ్యక్షుడు ఎస్వీ పెద్దబాబు, శ్యామ్‌సుందరం, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నియోజకవర్గ కార్యదర్శి శివకృష్ణ, కన్వీనర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రవాస తెలుగు వారికి చేయూత



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న రాతెస ప్రతినిధులు

భువనేశ్వర్: రాష్ట్రేతర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు వారి బాగోగుల పట్ల రాష్ట్రేతర తెలుగు సమాఖ్య(రాతెస) ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఈ మేరకు అస్సాం అగ్నిప్రమాద బాధితులకు విపత్తు సహాయం అందజేసింది. గౌహతి లోని ఘటాసిల్ ప్రాంతంలో ఇటీవల భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 60ఇళ్లు దగ్ధమయ్యాయి. బాధితుల్లో 56 తెలుగు కుటుంబాలు కావడంతో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సముచిత సాయానికి నడుం బిగించింది. దేశవ్యాప్తంగా విస్తరించిన రాతెస శాఖా కార్యవర్గం ఆర్థిక సాయానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది. పశ్చిమబెంగాల్ టిటాగడ్ ప్రాంతానికి చెందిన సంఘం ప్రతినిధులు ఈ.వీరరాజు, టి.శివలింగం ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించారు. రాతెస గౌహాతి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో బాధిత తెలుగు కుటుంబాలకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. అక్కడి కార్యవర్గం శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బాధితులను పరామర్శించడంతో పాటు చేయూత అందించామని రాతెస జాతీయశాఖ అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు తెలిపారు.

‘జెమ్స్’ని సందర్శించిన కంచి కామకోటి పీఠాధిపతి



భక్తులను ఆశీర్వదిస్తున్న విజయేంద్ర సరస్వతి, చిత్రంలో బొల్లినేని భాస్కరరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిని చైర్మన్ బొల్లినేని భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. తొలుత ఆస్పత్రి ఆవరణలోని గణపతి సమేత పూరీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం గావించారు.

దేశ సమైఖ్యత, ఉపాసనా, సమైక్యత కోసం తమ పీఠం కృషి చేస్తోందన్నారు. రోగులకు జెమ్స్ ఆస్పత్రి అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. క్యాన్సర్ ఆస్పత్రికి విజయేంద్ర సరస్వతీ స్వామి పేరుపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరసవల్లిలోని భాస్కరుడు పేరుతో జిల్లా వాసులకు జెమ్స్ ఆస్పత్రి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ చదువుతున్న వివిధ రాష్ట్రాల విద్యార్థులు మంచి విద్యాభ్యాసం కలిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండి మన రాష్ట్రం, దేశం ఆరోగ్యభారత్ కావాలని, ఇక్కడ అనారోగ్యంతో చేరిన రోగులకు స్వస్థత చేకూరి చిరునవ్వుతో తిరిగి వెళ్లాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ.. జిల్లాను క్యాన్సర్ రహితంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా ఆరు వేల మందికి ఉచితంగా విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఈవో ఆదిత్య్‌క్, సీఏవో ఎస్ రామ్మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ లలిత, మెడికల్ మేనేజ్‌మెంట్ వైద్యులు సుధీర్, సూపరింటెండెంట్ పద్మరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరావు, ఆర్ఎంవోలు బాలమురళీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



ఎన్నికల పరిశీలకుడు శ్యామలరావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావు, అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి తదితర ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వివరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖుల వెంట తహశీల్దార్ ఎం.వెంకటరావు, వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ తదితరులున్నారు.

శ్రీకూర్మనాథుడ్ని దర్శించుకున్న అనకాపల్లి ఎస్పీ



ఆదిత్యుని జ్ఞాపికను అందుకుంటున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలి

గార: శ్రీకూర్మనాథుడ్ని అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలి దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించగా.. ఈవో జి.గురునాథం ప్రసాదాన్ని అందజేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.